క్లుప్తంగా

ఓటుహక్కుపై అవగాహన



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న రమణ

చీపురుపల్లి: ఓటుహక్కు ఉన్న ప్రతిఒక్కరూ మే 13న జరగనున్న ఎన్నికల్లో ఓటు వేసి సద్వినియోగం చేసుకోవాలని ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ కోరారు. జిల్లాలో పోలింగ్ శాతం పెంచేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో యువతకు శుక్రవారం అవగాహన కల్పించారు. రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



సమ్మర్ క్యాంప్‌లో ప్రాక్టీస్ చేస్తున్న బాల, బాలికలు

శృంగవరపుకోట: ధర్మవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల/ జూనియర్ కళాశాలలో షటిల్ బ్యాడ్మింటన్ వేసవి శిక్షణ శిబిరాన్ని హెచ్ఎం ఉమా మహేశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు. చీఫ్ కోచ్ పి.శ్రీరాములు మాట్లాడుతూ శిబిరంలో 7 నుంచి 15 ఏళ్ల మధ్య వయసు గల బాల,బాలికలకు షటిల్ బ్యాడ్మింటన్‌లో శిక్షణ ఇస్తామన్నా రు. రోజూ ఉదయం 6 గంటల నుంచి 7.30 వరకు శిక్షణ ఉంటుందని, క్రీడాకారులకు పాలు, గుడ్లు ఇస్తామని తెలిపారు. పలువురు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం పరిశీలన



కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

గజపతినగరం రూరల్: నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సార్వత్రిక ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి శుక్రవారం పరిశీలించారు. కేంద్రంలో ఏర్పాట్లపై రిటర్నింగ్ అధికారి సూర్యకళను ఆరా తీశారు. పోలింగ్ సామగ్రి పంపిణీ, ఇతర అంశాలపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గజపతినగరం నియోజకవర్గం పరిధిలో 2,400 మంది పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నారని, వీరంతా ఈనెల 5,6,7 తేదీల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. హోం ఓటింగ్‌కు 34మంది దివ్యాంగులు, వృద్ధులను గుర్తించామని, వీరు ఈనెల 8,9,10 తేదీల్లో ఓటుహక్కును ఇంటివద్ద వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అన్ని సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రమేష్ తదితరులు ఉన్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి సామ్రాజ్యలక్ష్మి

జామి: వైద్యారోగ్య శాఖ సిబ్బంది ప్రజలకు క్షేత్రస్థాయిలో మెరుగైన వైద్యసేవలందించాలని, వైద్యశాఖ లక్ష్యాల సాధనలో ముందుండాలని జామి పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్.సామ్రాజ్యలక్ష్మి అన్నారు.స్థానిక పీహెచ్‌సీలో వైద్యసిబ్బందితో శుక్రవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఉపాధి పనుల వద్ద వేతనదారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. గర్భిణుల వివరాలను నమోదు చేసి, వారికి టీకాలు వేయాలని సూచించారు. ఆరోగ్య కేంద్రాల వద్ద ఓటీఆర్ కార్నర్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. హెల్త్ ఎడ్యూకేటర్ ఎన్. అనిల్‌ప్రేమ్‌కుమార్, సీహెచ్ఓ ఫ్లోరెన్స్, హెచ్ వీ భవానీ పాల్గొన్నారు.

నైతిక విలువలతో కూడిన విద్య అవసరం

లక్కవరపుకోట: నైతిక విలువలతో కూడిన విద్యా బోధన ఎంతో అవసరమని సుపథ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఏ.శ్రీహరి శర్మ అన్నారు. సుపథ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రామాలయం వద్ద విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీహరిశర్మ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో నైతిక విలువలు రోజురోజుకు తగ్గిపోతున్నాయని, వీటిని పెంపొందించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలు, మానవతా విలువలు, శ్లోకాలు, నీతి కథలు, సూర్యనమస్కారాలపై తరగతులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈనెల 30వ తేది వరకు శిబిరం కొనసాగుతుందని చెప్పారు.

ఇవేం కష్టాలు బాబు..



జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ బయట నిరీక్షిస్తున్న పింఛన్‌దారులు



ఎస్‌బీఐ లోపలకు వెళ్లేందుకు వృద్ధుల పాట్లు

ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటివద్దే పింఛన్ సొమ్ము అందుకునే వృద్ధులు, వితంతువులకు కొత్త కష్టం వచ్చింది. చంద్రబాబు పుణ్యమా అని మండుటెండల్లో బ్యాంకులకు పరుగులెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియమించిన వలంటీర్లు ప్రతినెలా క్రమం తప్పకుండా ఒకటో తేదీ వేకువజామునే ఇంటికొచ్చి మరీ పింఛన్లు అందించేవారు. వాళ్లు వైఎస్సార్‌సీపీకి ప్రచారం చేస్తారంటూ కక్ష కట్టిన చంద్రబాబు అండ్ కో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి వలంటీర్ల సేవలను నిలిపివేయించారు. దీంతో ఈ నెల పింఛన్ సొమ్మును ప్రభుత్వం బ్యాంక్ ఖాతాలకు జమ చేయడంతో నగదు తీసుకునేందుకు లబ్ధిదారులు ఎండల్లో అవస్థలు పడుతూ బ్యాంకులకు పరుగులెడుతున్నారు. వడదెబ్బ కారణంగా కొంతమంది వృద్ధులు మృత్యువాత పడ్డారు. హాయిగా ఇంటివద్దే నగదు అందుకునే మాలాంటి పండుటాకులపై నీకెందుకింత కక్ష అని చంద్రబాబుకు శాపనార్థాలు పెడుతున్నారు. – సాక్షి నెట్‌వర్క్

చంద్రబాబు వల్లే ఈ కష్టాలు..



ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయం ఆరు గంటలకే వలంటీర్ ఇంటికి వచ్చి ఫించన్ డబ్బులు ఇచ్చేవాడు. చంద్రబాబు పుణ్యమా అని ప్రస్తుతం పింఛన్ కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నాకు 70 సంవత్సరాలు దాటాయి.. ఎండలు చాలా దారుణంగా ఉన్నాయి. పింఛన్ డబ్బులు బ్యాంక్ ఖాతాకు జమచేయడంతో ఎండలోనే పరుగులు తీయాల్సి వస్తోంది. పేదలతో రాజకీయం చేయడం తగదు. మళ్లీ జగన్ వస్తేనే మాకు సక్రమంగా ఒకటో తేదీకే ఫించన్ డబ్బులు అందుతాయి.

– దయంత్రి పార్వతి, పాత కుమ్మరివీధి, చీపురుపల్లి

ఇబ్బంది పెట్టడం సరికాదు



ఇంటి దగ్గరే పింఛన్లు తీసుకునే మాలాంటి వారిని రాజకీయకక్షతో ఇబ్బంది పెట్టడం సరికాదు. బ్యాంక్ ఖాతాకు నగదు జమ చేయడంతో తీసుకునేందుకు అవస్థలు పడుతున్నాం. పింఛన్ సొమ్ముకోసం పూసపాటిరేగ స్టేట్‌బ్యాంక్ వద్ద గంటల తరబడి ఎండలోనే వేచి ఉన్నాం. చంద్రబాబునాయుడు ఇంత నీచంగా వ్యవహరించడం తప్పు.

– లోతేటి సావిత్రి, వృద్ధురాలు, గుంపాం, పూసపాటిరేగ మండలం

వలంటీర్ సేవలు కావాలి..



గతంలో ఒకటో తేదీన వలంటీర్లు పింఛన్ సొమ్ము ఇంటికి వచ్చి మరీ ఇచ్చేవారు. వలంటీర్లను రాజకీయ కోణంలో తొలగించడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. బ్యాంక్ వద్ద పింఛన్ డబ్బుల కోసం ఎండలోనే నిరీక్షించాల్సి వచ్చింది. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయితేనే మా కష్టాలు తీరి, ఒకటో తేదీన ఇంటి వద్దే పింఛన్ అందుతుంది.

– పారిపల్లి ఆదినారాయణ, వృద్ధుడు, పూసపాటిపాలెం, పూసపాటిరేగ మండలం

పింఛన్లు అడ్డుకోవడం సరికాదు..



కోడి కూయకముందే వలంటీర్లు అందిస్తున్న పింఛన్లను అడ్డుకోవడం సరికాదు. నేను మంచానికి పరిమితమయ్యాను. నా కుమారుడి సహాయంతో బ్యాంక్‌కు వెళ్లాల్సివచ్చింది. అవ్వాతాతలకు ఇబ్బంది పెడితే చంద్రబాబుకు ఏం వస్తుందో అర్థం కావడం లేదు.

– కండిపల్లి సన్యాసినాయుడు, పింఛన్‌దారుడు, వల్లంపూడి, వేపాడ మండలం

సీఎం జగన్‌కే ప్రజల మద్దతు

- ఎన్నికల ప్రచారంలో గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



బొండపల్లిలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

బొండపల్లి: ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్‌మోహన్ రెడ్డే రావాలని..ఆయనే కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని, ఈవిషయం ప్రతి గడపలోనూ చెబుతున్నారని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని బొండపల్లి,నెలివాడ,కెరటాం గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్సీ పి.సూర్యనారాయణమూర్తి రాజు(సురేష్‌బాబు)తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఘన స్వాగతం పలికారు. గ్రామాల్లో ర్యాలీ నిర్వహించిన అనంతరం ప్రచార రథంపై నుంచి ఎమ్మెల్యే మాట్లాడారు. పరిపాలనలో సీఎం జగన్ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారని, గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వాన్ని ప్రజల ఇంటి ముంగిటకు తీసుకువచ్చారన్నారు. అవినీతి, అక్రమాలకు తావులేని పారదర్శకంగా పాలన అందించారని చెప్పారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వలంటీర్ వ్యవస్థ ద్వారా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్లను ప్రతినెలా ఒకటో తేది ఉదయాన్నే తలుపుతట్టి అందజేశామని, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తన మనుషులు ద్వారా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి వలంటీర్ల సేవలను అడ్డుకున్నారని ఆరోపించారు. చంద్రబాబు తీరు వల్ల వృద్ధులు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే వలంటీర్ల సేవలు ప్రారంభమవుతాయని వివరించారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు, ప్రజాసంక్షేమం కోసం ఈ ఐదేళ్లలో రూ.1,800 కోట్లు ఖర్చు చేశామని వివరించారు.నాడు–నేడు ద్వారా ప్రభుత్వ స్కూళ్లను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దామని, గత టీడీపీ ప్రభుత్వ పాలనలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన గ్రామీణ ప్రాంత బీటీరోడ్లను పునరుద్ధరించామని పేర్కొన్నారు. సంక్షేమ, అభివృద్ధి పాలన కొనసాగేందుకు ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనను, విజయనగరం ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.వి.ప్రభాజీరాజు,ఎంపీపీ చల్లా చలంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొడ్డల చిన్నంనాయుడు, మాజీ ఎంపీపీ బండారు బంగారం, ఎమ్మెల్యే తనయుడు బొత్ససాయి గురునాయుడు, నియోజకవర్గ జేసీఎస్ ఇంచార్జ్ ఈదుబిల్లి కృష్ణ, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు గొట్టిముక్కల శివరామరాజు వర్మ, బొండపల్లి, నెలివాడ, సర్పంచ్‌లు బొండపల్లి ఈశ్వరరావు, తాళ్లపూడి కీర్తి, వైస్ ఎంపీపీ గొండేల ఈశ్వరరావు, నాయకులు తాళ్లపూడి అప్పలనాయుడు, తాళ్లపూడి కృష్ణ, మీసాల తులసీరాం,మహంతి రమణ,పల్లి రఘు,కోళ్ల వెంకటరమణ,బండారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

6న రక్తదాన శిబిరం



రెడ్‌క్రాస్ సొసైటీ కో ఆర్డినేటర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న గోవిందరాజులు

చీపురుపల్లి: పట్టణంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంక్ ఆవరణలో ఈ నెల 6న రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ కో ఆర్డినేటర్ బీవీ గోవిందరాజులు తెలిపారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చీపురుపల్లి కో ఆర్డినేటర్‌గా శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దాదాపు రూ.75 లక్షలతో ఇక్కడ బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటుచేయగా.. నిర్వహణ బాధ్యతలను రెడ్‌క్రాస్‌కు అప్పగించినట్లు తెలిపారు. నిర్వహణకు సంబంధించిన లైసెన్స్ త్వరలోనే వస్తుందని, వచ్చిన వెంటనే ఇక్కడ నుంచి సేవలు అందిస్తామన్నారు. ఇకనుంచి రక్తంతో పాటు ప్లేట్‌లెట్స్, ప్లాస్మా కూడా అత్యవసర సమయాల్లో ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇందుకోసం సోమవారం ఉదయం 8 గంటలకు రక్తదాన శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మేనేజింగ్ కమిటీ మెంబర్ రెడ్డి రమణ, ఆర్.శ్రీనివాసపట్నాయక్, ఎం.కృష్ణమూర్తి, కె.ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే ప్రజా సంక్షేమం

- ఎన్నికల ప్రచారంలో ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి



రామలింగాపురంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు దంపతులకు స్వాగతం పలుకుతున్న మహిళలు

కొత్తవలస: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రజా సంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాస రావు అన్నారు.మండలంలోని రామలింగాపురం, చీడివలస, దేవాడ, ముసిరాం,వియ్యంపేట, వీరభద్రపురం గ్రామాల్లో ఎమ్మెల్యే తన భార్య డాక్టర్ మధు, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలనాయుడుబాబుతో కలిసి శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే దంపతులకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈఐదేళ్లలో అందించిన సంక్షేమం, చేసిన అభివృద్ధిని వివరించారు. టీడీపీ నాయకుల మాయమాటలను నమ్మవద్దని సూచించారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలని అన్నారు. ఈ నెల 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనను, విశాఖ పట్నం ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని అధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ఎంపీపీ నీలంశెట్టి గోపమ్మ, జెడ్పీటీసీ నెక్కల శ్రీదేవి,పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు నెక్కల గౌరినాయుడు, వెంకటరమణ, ఎంపీటీసీ లెంక వరహాలు,పార్టీ మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, నాయకులు మేలాస్త్రి అప్పారావు, పి.ఎస్.ఎన్.పాత్రుడు, జి.రవికుమార్, కోన దేముడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకం

ప్రచార పర్వం

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు కొన్నిరోజులు మాత్రమే మిగిలి ఉండడంతో చీపురుపల్లి, గజపతినగరం,ఎస్.కోట నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే,ఎంపీ అభ్యర్థుల తరఫున వారి కు టుంబ సభ్యులు, నాయకులు ప్రచారం ముమ్మరం చేశారు. ఇంటింటికీ, ఉపాధి పనులు చేసే ప్రాంతాలకు వెళ్లి ప్రజలతో మమేకమవుతున్నారు. శుక్రవారం పలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు నిర్వహించిన ప్రచారానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. సంక్షేమ పథకాలతో అన్నివర్గాలకు మేలు చేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందని, సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి మళ్లీ వైఎస్సార్‌సీపీని అధి కారంలోకి తీసుకురావాలని కోరారు. – సాక్షి నెట్‌వర్క్



చీపురుపల్లి రూరల్: గరివిడి డీఎఫ్ఎస్ ఏరియాలో ఎన్నికల ప్రచారం చేస్తున్న బొత్స సందీప్, జెడ్పీటీసీ శ్రీనివాసరావు, తదితరులు



మెరకముడిదాం: రామాయవలసలో బ్యాలెట్ నమూనాతో ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గుర్ల: సొలిపిసోమరాజుపేటలో ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న కె.వి.సూర్యనారాయణరాజు



చీపురుపల్లిరూరల్(గరివిడి): కొండలక్ష్మీపురంలో ఉపాధి పనుల వద్ద ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గజపతినగరం: గజపతినగరంలోని బూర్లి వీధిలో ప్రచారం చేస్తున్న బొత్స సాయిగురునాయుడు



గంట్యాడ: పెంటశ్రీరాంపురంలో మాట్లాడుతున్న జైహింద్‌కుమార్, జెడ్పీటీసీ నరసింహమూర్తి



బొండపల్లి: రోళ్లవాకలో ఇంటింట ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



చీపురుపల్లి: చీపురుపల్లి పట్టణంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు,బొత్స సందీప్

ఓటు అడిగే హక్కు, ధైర్యం మనకే ఉంది

- వైఎస్సార్‌సీపీ విజయానికి బూత్ కమిటీలు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి
- ప్రతి కుటుంబానికీ పథకాలు అందించాం
- గడప గడపకూ వెళ్లి ఓటు అభ్యర్థించాలి
- పార్టీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కో–ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కో–ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు



పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

శృంగవరపుకోట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ మేలు జరిగిందని, వివక్ష లేకుండా గ్రామాలను అభివృద్ధి చేశామని, ప్రతి కుటుంబం దగ్గరికీ వెళ్లి ఓటు అడిగే హక్కు, ధైర్యం మనకే ఉందని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కో–ఆర్డినేటర్, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఎస్.కోటలోని శిరికి రిసార్ట్స్‌లో నియోజకవర్గంలోని ఐదు మండలాల బూత్‌కమిటీ కన్వీనర్లు, ఏజెంట్లతో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు నేతృత్వంలో, పార్టీ ఎస్.కోట మండల అధ్యక్షుడు మోపాడ కుమార్ అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. అతిథిగా హాజరైన మజ్జి శ్రీనివాసరావు పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈఎన్నికల్లో విజయం ప్రజలు, మన గ్రామాల బాగుకోసం అవసరమన్నారు. నియోజకవర్గంలోని 270 బూత్ ల్లో ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు తదితర నాయకులు పార్టీ విజయం కోసం బాధ్యతలు తీసుకోవాలన్నారు. కొన్ని మీడియాలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, అభ్యర్థులపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని, క్షేత్రస్థాయిలో వాటిని తిప్పికొట్టాలని సూచించారు. అధికారంలో లేనప్పుడు ఎన్నో ఇబ్బందులు పడిన విషయాన్ని విస్మరించొద్దన్నారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికీ పార్టీలో సమాన అవకాశాలు ఉంటాయన్నా రు. వలంటీర్లు లేకపోవడం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను ప్రజలకు తెలియ చెప్పాలన్నారు. రాజీనామాలు చేసిన వలంటీర్లకు మళ్లీ జగన్ ముఖ్యమంత్రి కాగానే నియామకాలు ఇస్తారన్నారు. ఎన్నికలకు కొద్ది రోజులు మాత్రమే సమయం ఉన్న నేపథ్యంలో నిత్యం కష్టపడుతున్న సీఎం జగన్‌ను స్ఫూర్తిగా తీసుకుని బూత్ కమిటీలు, కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పని చేయాలని కోరారు. గడప గడపకూ వెళ్లి ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని ఓటర్లకు వివరించి, వారి ఓటును అభ్యర్థించాలని సూచించారు. మనం అధికారంలోకి వస్తే ప్రతీ ఎకరానికి సాగునీరు వస్తుందని రైతులకు ధైర్యంగా చెప్పాలన్నారు. ఎస్.కోటలో గెలిచే పార్టీనే ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్న నానుడి నిజం చేయాలన్నారు. విశాఖపట్నం ఎంపీ స్థానం గెలుపులో ఎస్.కోట వేదిక కావాలని, మంత్రి బొత్స నాయకత్వంలో అంతా నడవాలని సూచించారు.

అంతా సహకరించాలి

ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ తొమ్మిది రోజులూ ప్రతి నిమిషం ఎంతో విలువైనదన్నారు. ఐదేళ్లు ఎన్నో కార్యక్రమాలతో జనంలో ఉన్నామని, ఇప్పుడు'జగన్‌అన్న కోసం సిద్ధం' కార్యక్రమాన్ని ప్రారం భించామని చెప్పారు. ప్రచారానికి అందరూ సహకరించాలని కోరారు. రాష్ట్ర వెలమ కార్పొరేషన్‌చైర్మన్ నెక్కల నాయుడుబాబు మాట్లాడుతూ ఓట్లు చీలకుండా చూడాలని, 75 శాతం ఓట్లు సాధించేలా పనిచేయాల ని, టీడీపీ మైండ్ గేమ్‌కి మనం పడకూడదని, ఎల్లో మీడియా ప్రచారాన్ని తిప్పికొట్టాలని, మనం చేసిన పనులు చెప్పుకుంటే చాలన్నారు. జిల్లాలో బలమైన నాయకత్వం మనకు అండగా ఉందన్నారు. డీసీసీబీ చైర్మన్ చిన రామునాయుడు మాట్లాడుతూ గెలుపే ధ్యేయంగా కసితో పనిచేయాలని చెప్పారు. జనం కోసం జగన్ గెలవాలని అన్నారు. నియోజకవర్గ పార్టీ పరిశీలకులు తైనాల విజయ్‌కుమార్ మాట్లాడుతూ విశాఖ రాజధాని అయి తే ప్రపంచ స్థాయి నగరమవుతుందని, ఉత్తరాంధ్ర సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. అవినీతి, లంచం లేని పాలన చూసి ఓర్వలేని, బాబు అండ్ కో దుష్ప్రచారం చేస్తున్నారని, వాటిని తిప్పికొట్టా లని సూచించారు. జీసీసీ చైర్‌పర్సన్ డాక్టర్ స్వాతి రాణి, ఐదు మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు, పార్టీ మండల అధ్యక్షులు, జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గృహసారథులు, నాయకులు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా

మెరకముడిదాం: మండలంలోని ఉత్తరావల్లి సచివాలయం పరిధిలో 11 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేసి సచివాలయ కార్యదర్శికి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సేవాభావంతో విధులు నిర్వహిస్తున్న తమపై ప్రతిపక్షాలు తప్పుడు ఆరోపణలు చేయడంపై మనస్తాపం చెంది రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు.

- **గుర్ల:** మండలంలోని వల్లాపురం,కెల్ల,జమ్ము,జమ్ముపేటకు చెందిన 30 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం అందజేశారు.
- **దత్తిరాజేరు:** కోమటిపల్లి, మరడాం, గదబవలస, కె.కొత్తవలస,ఎస్.భూర్జవలస గ్రామాలకు చెందిన 37 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ చంద్రకుమారికి శుక్రవారం అందజేశారు. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 183 మంది వలంటీర్లు రాజీనామా పత్రాలు అందజేశారని ఎంపీడీఓ చెప్పారు.
- **గంట్యాడ:** మండలంలోని కొండతామరపల్లి గ్రామానికి చెందిన 9 మంది వలంటీర్లు రాజీనామా చేశారు.
- **బొండపల్లి:** మండలంలోని ముద్దూరు సచివాలయం పరిధిలో 10 మంది, నెలివాడ సచివాలయం పరిధిలో 9 మంది, గొల్లుపాలెం సచివాలయం పరిధిలో ఏడుగురు వలంటీర్లు తమ రాజీనామా పత్రాల ను పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం అందజేశారు.
- **జామి:** మండలంలోని అలమండ–1,2 సచివాలయాల పరిధిలో 18 మంది, ఎం.కె.వలసలో 11 మంది, ఏ.ఆర్.పేటలో 13 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు.
- **లక్కవరపుకోట:** మండలంలోని గొల్జాం గ్రామ సచివాలయం పరిధిలో 15మంది వలంటీర్లు శుక్రవారం తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శికి అందజేశారు.ఎంపీడీఓ రూపేష్ మాట్లాడుతూ మండలంలోని 23 సచివాలయాల పరిధిలో 264 మంది వలంటీర్లు ఉన్నారని,వీరిలో 172 మంది ఇప్పటి వరకు రాజీనామా చేశారని చెప్పారు.